క్లుప్తంగా

అనుమతుల్లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు


ఎస్సై జానీ బాషా

కె.గంగవరం: దీపావళి సందర్భంగా గ్రామాల్లో అనుమతులు లేకుండా మందుగుండ సామగ్రి అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై జానీబాషా అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల వద్ద తయారు చేయడం నేరమని, ఏవరైనా అలా తయారు చేస్తున్నారని సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని అనుమతులతో లైసెన్స్ పొందాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో లైసెన్స్ పొందిన వ్యక్తులు తమ షాపుల వద్ద తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు


బందనపూడిలో సీసీ రోడుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

కాజులూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అధికారులు, నాయకులు సీసీ రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బందనపూడి, టి మామిడాడ, పెనుమళ్ల, తనుమళ్ల, అయితపూడి, అంద్రంగి తదితర గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, ఎంపీడీఓ జే రాంబాబు తదితరులు రూ.3.34 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 27 పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో బందనపూడి గ్రామ సర్పంచ్ డేగల తిరుమల వేణి, పెనుమళ్ల, ఆర్యావటం మాజీ సర్పంచ్‌లు వనుం వీరబ్రహ్మం, కోట తాతబ్బాయి, మండల గౌడా సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


రాయవరంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

రాయవరం: మండలంలోని వెదురుపాక, రాయవరం, వెంటూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భూమిపూజ చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వెదురుపాకలో రూ.20 లక్షలు, రాయవరంలో రూ.30 లక్షలు, వెంటూరులో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. భూమిపూజలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ గంటి రోజా, డీఎల్‌డీవో ఎ.శాంతి, ఎంపీడీవో కీర్తి స్పందన, ఎంఈవోలు పి.రామలక్ష్మణ మూర్తి, వై.సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను, స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, దేవిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	: 9849903905
ఎంపీడీవో	: 9912191666
మండల విద్యాశాఖాధికారి1	: 9948523380
మండల విద్యాశాఖాధికారి2	: 7013074928
పోలీసు స్టేషన్	: 08857235333
సబ్‌ఇన్‌స్పెక్టరు	: 9440904843
రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు:	8309351543, 7013003149
మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు :	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	: 8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	: 7702072648
డ్వాక్రా ఏపీఎం	: 9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	: 9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	: 9440812651
హౌసింగ్ ఏఈ	: 7093930489
మండల పశువైద్యాధికారి	: 8074154935
ఉద్యానవన శాఖ అధికారి	: 8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	: 9100121182

సినిమాలు

రామచంద్రపురం

రాజగోపాల్	:	శ్వాగ్
కిషోర్	:	దక్షిణ
శ్రీసూర్య	:	దేవర
ద్రాక్షారామ		
శ్రీలక్ష్మి	:	సత్యం సుందరం
శ్రీసూర్య	:	దేవర

పోటీ పడితే.. పతకమే..


ద్రాక్షారామకు చెందిన వాసిరెడ్డి జానకి బ్రింద


ద్రాక్షారామ మార్కెట్ వీధికి చెందిన కైరం విష్ణువర్ధన్


ద్రాక్షారామ మండాలమ్మ పేటకు చెందిన సంతోష్


తోటపేటకు చెందిన అల్లం ప్రియదర్శన్ కార్తిక్


తోటపేటకు చెందిన సబ్బెళ్ల పవన్ వెంకట్‌రెడ్డి

- చిన్న వయస్సులోనే విజయాలు సొంతం
- కరాటే, కిక్ బాక్సింగ్‌లలో సత్తా చాటుతున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఆ విద్యార్థులు ఏ పోటీకి వెళ్లినా విజయం వారి సొంతమవుతుంది. ఏ బరిలో దిగినా పతకం వారిదే. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే, కిక్ బాక్సింగ్ తదితర ఆత్మ రక్షణ విద్యల్లో తమ సత్తా చాటుతున్నారు. ఆ విద్యార్థులకు మండలంలోని ద్రాక్షారామ శివరంజని థియేటర్ వీధికి చెందిన కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణ శిక్షణ ఇస్తున్నారు. ఆ విద్యార్థుల విజయాల గురించి తెలుసుకుందాం

తగ్గేదేలే అంటున్న జానకి బ్రింద..

మండలంలోని ద్రాక్షారామకు చెందిన వాసిరెడ్డి జానకి బ్రింద ఆరో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి రాంబాబు బిల్డర్‌గా, తల్లి రమాదేవి డెంటల్ డాక్టర్‌గా పని చేస్తున్నారు. జానకి బ్రింద 2021 అక్టోబర్ 4న జరిగిన ఆల్ ఇండియా కరాటే పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. 2022 ఫిబ్రవరి 24న జరిగిన కిక్ బాక్సింగ్ నేషనల్ పోటీల్లోనూ మొదటి స్థానం సాధించింది. 2023 మే 12న జరిగిన స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో 2వ స్థానం, 2023 నవంబర్ 19న జరిగిన స్టేట్ లెవల్ పోటీల్లో రెండో స్థానం, 2024 జూన్ 14న జరిగిన స్టేట్ లెవెల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి పతకాలు సాధించింది. అటు చదువులోను, ఇటు కరాటే పోటీల్లోనూ తగ్గేదేలే దంటూ చిన్నారి జానకి బ్రింద దూసుకుపోతోంది.

పోటీకి వెళితే పతకం నాదే..

ద్రాక్షారామ మార్కెట్ వీధికి చెందిన కైరం విష్ణువర్ధన్ ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి భీమశంకరం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పని చేస్తున్నారు. విష్ణువర్ధన్ 2022 నవంబరు 24న స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. 2023 అక్టోబర్ ఒకటిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో రెండో స్థానం సాధించాడు. 2023 మే 7న స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించాడు. 2024 ఏప్రిల్‌లో స్టేట్ లెవెల్ కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్, 2024 సెప్టెంబర్‌లో నేషనల్ కిక్ బాక్సింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. పోటీకి వెళితే పతకం నాదే అంటూ విశ్వాసం చాటుతున్నాడు.

స్టేట్ ఏదైనా.. ఫ్లేస్ నాదే..

ద్రాక్షారామ మండాలమ్మపేటకు చెందిన ఆసనాల సంతోష్ ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి రాజు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి మరియమ్మ గృహిణిగా ఉన్నారు. 11 ఏళ్ల సంతోష్ గడచిన ఆరేళ్లలో కరాటే, కిక్ బాక్సింగ్‌లలో శిక్షణ పొందుతూ ఇప్పటి వరకూ 22 పోటీల్లో పాల్గొన్నాడు. 18 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2018లో ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లోను, 2019 లో నేషనల్ కరాటే పోటీల్లోను మొదటి స్థానం సాధించాడు. 2021లో ఆల్ ఇండియా కరాటే పోటీల్లో రెండో స్థానం సాధించాడు. 2022లో నేషనల్ కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించాడు. స్టేట్ ఏదైనా పోటీల్లో పాల్గొంటే ఫ్లేస్ నాదే అంటూ చెబుతున్నాడు.

కరాటే అంటే ప్రాణం

మండలంలోని తోటపేటకు ఎందిన అల్లం ప్రియదర్శన్ కార్తిక్ ఆరో తరగతి చదువుతున్నాడు. తండ్రి రాజేష్ టైల్స్ మేస్త్రి, తల్లి దుర్గ గృహిణి. చిన్న వయస్సు నుంచే కరాటే శిక్షణ పొందుతున్న ప్రియదర్శన్ కార్తిక్ ఎనిమిదేళ్ల వయస్సులోనే స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో మందటి స్థానంలో నిలిచాడు. 2021లో ఆల్ ఇండియ కరాటే నేషనల్స్‌లో మొదటి స్థానం సాధించాడు. 2022లో స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో మొదటి స్థానం పొందాడు. 2023లో పూణేలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. కరాటే అంటే ప్రాణం అంటున్న కార్తిక్ పతకాలు సాధిస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు.

చిన్న వయసులోనే..

మండలంలోని తోటపేటకు చెందిన సబ్బెళ్ల పవన్ వెంకట్‌రెడ్డి 2వ తరగతి చదువుతున్నాడు. తండ్రి ఎస్ఎస్ రెడ్డి వ్యాపారం, తల్లి హర్షిణి గృహిణిగా ఉన్నారు. ఏడేళ్ల వయసు గల పవన్ వెంకట్‌రెడ్డి తన 3వ ఏటా నుంచే కరాటే, కిక్ బాక్సింగ్‌లలో శిక్షణ పొందుతూ పతకాలు సాధించాడు. 2022లో స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. 2024 లో కిక్ బాక్సింగ్‌లో మొదటి స్థానం సాధించాడు. చిన్న వయస్సులోనే పతకాలు సాధిస్తూ చిచ్చర పిడుగులా కరాటే, కిక్ బాక్సింగ్‌లలో రాణిస్తున్నాడు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక


రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గం

రాయవరం: మండలంలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఉన్నత పాఠశాలల వారీగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు యూటీఎఫ్ నూతన కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.జయలక్ష్మి, బి.శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా పి.లోవరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీహెచ్ఎస్ వెదురుపాక యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి.బుల్లికుమారి, యు.దుర్గారావు, కోశాధికారిగా సత్తిరాజు, మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.శ్రీనివాసు, జి.హైమావతి, కోశాధికారిగా ఎన్‌వీ గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంవీఆర్ఎస్‌కే వరలక్ష్మి, ఎం.వీరభద్రరావు, కోశాధికారిగా సి.కృష్ణకుమారి ఎన్నికయ్యారు.

దేశం గర్వించదగ్గ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా


ద్రాక్షారామలో ప్రొఫెసర్ సాయిబాబా చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల మృతి చెందిన ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా సంస్మరణ సభ ద్రాక్షారామలోని కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయం భవనంలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా దేశం గర్వించదగ్గ మేధావి అన్నారు. ఆయన ఆదివాసులపై రాజ్యమేలుతున్న దమనకాండను ప్రశ్నించే గొంతు కోసం పీడిత ప్రజల హక్కుల కోసం నిరంతరం తపించారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను శారీరకంగా, మానసికంగా తీవ్ర చిత్ర హింసలకు గురి చేసిన హిందుత్వ ఫాసిస్టు మోదీ ప్రభుత్వం ఆయన మృతికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, పీవైఎల్ నాయకుడు అంబటి కృష్ణ, జై భీమ్ సంక్షేమ సంఘం నాయకుడు గుబ్బల శ్రీను, శిరోముండనం ఐక్య పోరాట వేదిక నాయకులు వెంటపల్లి రామకృష్ణ, రేవు నాగేశ్వరరావు, చల్లపూడి పట్టాభి, పీడీఎస్‌యూ నాయకులు ఎం. శంకర్, ఆర్.భీమశంకరం, తేజ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణలో మాట్లాడుతున్న శంకర నారాయణమూర్తి

కాజులూరు: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనా పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న శిక్షణా తరగతులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకర నారాయణయమూర్తి అన్నారు. మండల వ్యాప్తంగా గొల్లపాలెంలో దోబి పనివారికి ఏడు రోజుల పాటు జరుగనున్న శిక్షణా తరగతులను బుధవారం శంకర నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేలు విలువజేసే ఆధునిక పనిముట్లు అందజేస్తారని వీటిని సక్రమంగా వినియోగించుకుంటున్న వారికి బ్యాంకుల నుంచి రూ ముడు లక్షల వరకూ రుణసదుపాయం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీసెల్ మీడియా కోఆర్డినేటర్ రొక్కాల సత్తిబాబు, శిక్షణా తరగతుల జిల్లా కో ఆర్డినేటర్లు వి శ్రీనుబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ జోలికి వస్తే సహించబోం

మహాసేన రాజేష్‌పై బుంగ సంజయ్ మండిపాటు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బుంగ సంజయ్ తదితరులు

మండపేట: మాదిగ పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత అయిన మంద కృష్ణమాదిగ జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని మహాసేన రాజేష్‌పై ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ మండిపడ్డారు. తమ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కనిపించిన చోటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. స్థానిక రథం సెంటర్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఓ సభలో మహాసేన రాజేష్ తమ నాయకుడు మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. మంద కృష్ణను బిజ్జలదేవతో పోలుస్తూ కించ పరిచేలా మాట్లాడారన్నారు. అంతేగాకుండా తాను గొడవకు వెళుతున్నాను. తనతో ఎవరొస్తారంటూ కులాల మధ్య విద్వేషాలు రెచ్చ గొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పటి వరకూ కారెం శివాజీ, హర్ష కుమార్, మల్లెల వెంకట్రావు వంటి ఎందరో నేతలు తమ ఆలోచనా విధానాల మేరకు తాము నమ్మిన సిద్ధాంతంపై రాజ్యాంగ బద్ధంగా పోరాటాలు చేశారే తప్ప, ఇలా రాజేష్‌లా గొడవలకు ఏనాడూ ఉసిగొల్పలేదన్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను తీవ్రంగా విమర్శించిన రాజేష్ ఆ తరువాత కూటమిలో చేరారన్నారు. ఆపై పిచ్చి పిచ్చి ఆలోచనలతో జనసేన పార్టీపై అనుచిత వాఖ్యలు చేశారని సంజయ్ మాదిగ విమర్శించారు. దీంతో ఇంటా బయటా తీవ్ర విమర్శలు రావడంతో ఇప్పుడేం చేయాలో పాలుపోక ఎమ్మార్పీఎస్ ఉద్యమం పైనా, మంద కృష్ణ మాదిగ పైనా వివాదాస్పద వాఖ్యలు చేస్తున్నారన్నారు. వీటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా చేసిన తప్పులు తెలుసుకుని కృష్ణ మాదిగకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని మహాసేన రాజేష్‌కు సూచించారు. లేని పక్షంలో మాదిగల చేతిలో మహాసేనకు ఘోర పరాభావం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సవరపు సతీష్, మందపల్లి దొరబాబు, బజ్జంగి సుధాకర్ మాదిగ, మందపల్లి శ్రీనుబాబు, బుంగ సునీల్‌దత్, ముమ్మిడివరపు నారాయణరావు, డీఎస్ రాజు, పల్లేటి సతీష్, ముమ్మిడివరపు త్రిమూర్తులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..


బెర్మలు లేక కోట వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: ఆహ్లాదకరంగా ఉందని గోదావరిని చూస్తూ వాహనాలు నడిపితే ఆసుపత్రిపాలవ్వల్సిందే. పర్యాటకంగా ఉండే జోన్నడ-యానం ఏటిగట్టు రహదారికి బెర్మలు లేక పోవడం ప్రమాదకరంగా మారింది. గత పుష్కరాల్లో రూ.30 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రోడ్డు బాగుండడంతో జొన్నడ-యానం రహదారిలో వందలాది మంది ప్రయాణిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో బెర్మలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని ఏటిగట్టు మరింత ప్రమాదకంరగా ఉంది. కోటిపలి-కోట, బ్రహ్మపూరి-గోవలంక మధ్య ఉన్న ఏటిగట్టు కోతకు గురై బెర్మలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వహనాలు కనపడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టు రహదారికి బెర్మలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు హిందీ సిలబస్ తగ్గింపు

- టెన్త్‌లో నాలుగు చాప్టర్ల తొలగింపు
- ఫలించిన ఉపాధ్యాయుల డిమాండ్


విద్యార్థులకు పాఠం చెబుతున్న హిందీ మాస్టారు ఎన్‌టీ శ్రీనివాస్

కపిలేశ్వరపురం: ప్రపంచంలో నాలుగో అతిపెద్ద మాతృ భాషగా హిందీ గుర్తింపు పొందింది. అంతటి భాషను విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించాలి. సిలబస్‌ను సైతం తగిన స్థాయిలోనే నిర్దేశించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి హిందీ భాషను ఆరో తరగతి నుంచి సబ్జెక్టుగా చదువుతున్నారు. విద్యార్థులకు భారంగా ఉన్న హిందీ సిలబస్‌ను తగ్గించాలంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. టెన్త్ హిందీ సిలబస్‌లో నాలుగు చాప్టర్లు మినహాయిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు ఈ నెల 1న ఉత్తర్వులు జారీ చేశారు.

సిలబస్ తగ్గించిన నేపథ్యమిదీ..

2022-23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల్లో హిందీ మాతృభాష కావడంతో సీబీఎస్‌సీ సిలబస్ భారం కాదు. ఆంధ్రప్రదేశ్‌లో హిందీని ఆరో తరగతి నుంచి మాత్రమే చదువుతారు. ఆ పునాదితో పదో తరగతిలో సీబీఎస్‌సీ సిలబస్‌లోని హిందీ పాఠాలను చదవడం విద్యార్థులకు ఇబ్బంది అవుతున్నట్టు పలుమార్లు ఉపాధ్యాయులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏడాది ఆగస్టు 28న కాకినాడలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణికి హిందీ ఉపాధ్యాయులు వినతి పత్రాన్ని అందజేశారు. తెలుగు మీడియం నేపథ్యం గల 9,10 తరగతుల సీబీఎస్‌ఈ విద్యార్థులకు సిలబస్ భారమైదన్న విషయాన్ని ప్రభుత్వం ముందు ఉంచారు. రాష్ట్రంలోని వెయ్యి ప్రభుత్వ సీబీఎస్‌ఈ పాఠశాలలను ప్రభుత్వం స్టేట్ సిలబస్‌లోకి మార్చిన నేపథ్యంలోనూ హిందీ సిలబస్ భారమైన సమస్య ఉంది. నవంబర్ 30 లోగా సిలబస్‌ను పూర్తి చేయాల్సి ఉంది. పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షా విధానానికి అనుగుణంగా పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలో జాతీయ విద్య పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌ను అమలు చేస్తున్నారు. దీంతో హిందీ సబ్జెక్టుకు సైతం ఎన్‌సీఈఆర్టీ పుస్తకాలనే వినియోగిస్తున్నారు. అందులో హిందీ పాఠాలు ఎక్కువై సిలబస్ భారమైన నేపథ్యలో పాఠశాల విద్యాశాఖ కొన్ని చాప్టర్లను తొలగించింది. పద్యభాగ్-7 (ఆత్మత్రాణ్), గద్యభాగ్-11 (తీసరీ కసమ్ కే వశల్ పకార్ శేలేంద్ర), గద్యభాగ్-12 (అబ్ కహా దూస్‌రోంకే దుఖ్ సే దుఖీ హోనేవాలీ, ఉపవాచక్-3 (టోపీశుక్లా) పాఠాలను తొలగించారు. వాటిని ఉపాధ్యాయులు బోధించాల్సిన అవసరం లేదని ఉత్తర్వులిచ్చారు.

విద్యార్థులపై భారం తగ్గుతుంది



మన రాష్ట్రంలో ఆరోతరగతి నుంచి మాత్రమే హిందీ సబ్జెక్టు ప్రారంభమవుతుంది. అక్షరాల నుంచి సొంతంగా వాఖ్యాలు రాసే స్థాయికి రావడానికి సమయం పడుతుంది. ఆనేపథ్యంలో హిందీ సబ్జెక్టులోని సిలబస్‌ను తగ్గించమని కోరాము.

– రేవు భీమారావు, హిందీ ఉపాధ్యాయుడు

తడి,పొడి చెత్తపై అవగాహన


వార్డులో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీలు

మండపేట: గృహాల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి, వాటిని డస్ట్‌బిన్‌ల ద్వారా పారిశుధ్య కార్మికులను అందివ్వాలని కోరుతూ మెప్మా రీసోర్స్ పర్సన్లు (ఆర్పీ) అవగాహన కల్పిస్తున్నారు. ఆర్పీలు బృందాలుగా విడిపోయి ప్రతి వార్డుకూ వెళ్లి మహిళలకు వివరిస్తున్నారు. తడి చెత్తను ఒక డస్ట్ బిన్‌లోను పొడి చెత్తను వేరొక డస్ట్‌బిన్‌లోను వేసి కార్మికులకు ఇవ్వాలని చెబుతున్నారు. అలాగే చెత్తను డ్రెయిన్లలో వేయకూడదని సూచిస్తున్నారు. డ్రెయిన్లలో చెత్త వేయడం ద్వారా మురుగు పారుదలకు ఆటకం ఏర్పడి దోమలు పెరిగిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటించాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లు గానీ గ్లాసులు గానీ వాడకూడదన్నారు. మార్కెట్‌కు వెళ్లే వారంతా గుడ్డ సంచులు వెంటబెట్టుకుని వెళ్లాలని చెప్పారు.

గోతులు పూడ్చాలని వినతి


చాకిరేవు మెరక రామాలయం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, యానం రహదారిలో కాజులూరు శివారు చాకిరేవు మెరక రామాలయం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులను పూడ్చాలని ప్రయాణికుల కోరుతున్నారు. ఈ రహదారిలో గొల్లపాలెం, కుయ్యేరుల మధ్య రూ.34 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారు. ఎన్నికల ముందు నిలిచిపోయిన నిర్మాణం పనులు నేటికీ ముందుకు సాగకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షాల సమయంలో గోతులలో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటో, ట్యాక్సీ వంటి వాహనాలు సైతం గోతులు దాటి వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. అధికారులు స్పందించి తక్షణ చర్యల్లో భాగంగా కనీసం గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని మండల బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరావు, పలువురు స్థానికులు, ప్రయానికులు కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రామచంద్రపురం: పట్టణ సబ్ స్టేషన్‌లో 11కేవీ టౌన్ ఫీడర్, ఓడూరు చెల్లూరు ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. రత్నలరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెయిన్ రోడ్డు, రత్నంపేట, హౌసింగ్ బోర్డు, లలితానగర్, ముచ్చుమిల్లి, రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, ఏరియా ఆసుపత్రి, గాంధీహాస్పిటల్, ముచ్చుమిల్లి రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, కమ్మవారిసావరం, కవలవారిసావరం, ఓడూరు, ఆక్వా చెరువులు, నరసాపురపుపేట, చోడవరం, వీఎస్ఎం కళాశాల, గుబ్బల వారిపేట, స్టీల్‌విల్‌పేట, అంకంవారివీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

రామచంద్రపురం రూరల్: వార్షిక మరమ్మతుల కారణంగా ద్రాక్షారామ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ ద్రాక్షారామ సబ్ స్టేషన్, 11 కేవీ హసన్‌బాద ఫీడర్లలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రత్నాలరావు సూచనల మేరకు మరమ్మతులు, ట్రీ కటింగ్‌ల నిమిత్తం ద్రాక్షారామ, అన్నాయిపేట, వెంకటాయపాలెం, హసన్‌బాద, కందులపాలెం, గొల్లలచెరువు, భీమక్రోసుపాలెం గ్రామాల్లో కరెంట్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.